


-షెహనాజ్

కొద్దిరోజులుగా నాకో విషయం పంటికింది రాయిలా తగులుతూ ఉంది.

అది ఎవరితో చెప్పుకోలేని విషయం. సభ్యత సంస్కారం అడ్డువచ్చే అడగకూడని విషయం.

కాని మా ఆవిడ దగ్గర సభ్యత సంస్కారం లాంటివి పాటించనవసరం లేకపోవటంతో ఆ విషయం గురించి తర్కించుకుంటూనే ఉన్నాం.

మా ఆవిడ కూడా ఈ విషయాన్ని శోధించటంలో నాకు సహకరిస్తున్నది.

ఇక ఈ ఉపోద్ఘాతం చాలించి అసలు విషయానికొస్తాను.

నేనా వూరికి వచ్చి రెండు మూడు నెలల పైనే అయింది.

మా ఆఫీసు క్వార్టర్స్‌లోనే ఇల్లు దొరికింది. చాలా అనుకూలంగా కట్టడంతో ఆ క్వార్టర్ మా ఆవిడకీ నచ్చింది.

ఇరుగు పొరుగు మంచివాళ్లు కావటంతో కాలం ఆనందంగా గడిచిపోతోంది. కాని మా ఇంటి ఎదురుగానే మా ఆఫీసర్ మేడమ్ గారి ఇల్లు ఉండటంతో మొదట కంగారుపడ్డాను.

ఆఫీసరుగారి ఎగ్జిక్యూటివ్ క్వార్టర్ ఏదో రిపేరులో వుండటంతో ఈ క్వార్టర్ ఎలాట్ చేశారట. ఇది అనుకూలంగా ఉండటంతో ఇక్కడే సెటిలయిపోయిందిట ఆవిడ.

కాని ఏ మాటకామాట చెప్పుకోవాలి. తను ఓ గొప్ప ఉద్యోగస్థురాలని ఆవిడలో ఏ కోశాన గర్వాతిశయాలు కన్పించవు.

ఆవిడ పేరు సరోజినీ. వయస్సు నలభై అయిదేళ్లు దాటి ఉంటాయి. కాని మనిషి మంచి అవయవ సౌష్ఠవంతో దృఢంగా ఉంది.

వచ్చిన కొద్ది రోజులకే మాతో బాగా కల్సిపోయి మాకే అవసరమొచ్చినా నిరభ్యంతరంగా తన దగ్గరికి రావచ్చుని - స్నేహహస్తాన్ని అందించింది.

మరీ అందగత్తె కాకపోయినా చూడటానికి మంచి కనుముక్కు తీరులో చక్కగా ఉంటుంది.

మనిషిలో హుందాతనం ఉట్టిపడ్తుంటూంది.

కాని ఆ ఇంట్లో ఆమె ఒంటరిగా ఉండటమే మాకు విస్మయాన్ని కలిగిస్తుంటుంది.

ఆవిడ వివాహితని - భర్త నుండి విడాకులు తీసుకుందని ఎవరో చూచాయగా చెప్పగా తెల్సింది.

కాని నాకూ మా ఆవిడకి అంతుపట్టని విషయం మరోటుంది.

అలా ఒంటరిగా జీవిస్తున్న ఆవిడకు ఓ వ్యక్తితో సన్నిహిత సంబంధాలున్నట్లు కనుగొన్నాం.

ఆ వ్యక్తి పేరు రాజారాం. అతడు కూడా ఏదో కంపెనీలో మంచి హోదా గల ఉద్యోగమే చేస్తున్నాడు. అతనికి భార్యా పిల్లలున్నారు.

కాని రాజారాం మేడమ్ గారింటికి తరచుగా వచ్చి ఊడిగం చెయ్యడం వింతగా అన్పించింది.

ఆ ఇంట్లో కరెంటు బిల్లు, ఫోన్ బిల్లు కట్టాలన్నా - పాలవాడికి డబ్బు ఇవ్వాలన్నా - బ్యాంకులో డబ్బు డ్రా చెయ్యాలన్నా - చివరికి ఆవిడ చీరలు కొనాలన్నా అన్నింట్లో అతని ప్రమేయముండాలి.

ఒక్కోసారి ఆవిడని తన స్కూటర్‌పై ఆఫీసు దగ్గర దింపటం - తిరిగి ఆఫీసు నుండి ఇంటికి చేర్చడం వంటి బాధ్యతలు కూడా తనపై వేసుకునేవాడు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ తెచ్చే పని కూడా అతనిదే.

★ ★ ★

సాయంకాలం వేళల్లో మా ఇంటి ఆవరణలో కుర్చీలు వేసుకుని టీ తాగటం అలవాటు నాకూ మా ఆవిడకూ.

మా ఇళ్లు ఎదురెదురుగా ఉండటంతో ఆవిడ కూడా వచ్చి మాతోపాటు కూర్చుని కులాసాగా కబుర్లు చెప్పుకోవటం అలవాటు.

అలా ఓ సాయంకాలం - అందరం కూర్చుని టీ సేవిస్తుండగా మా ఆవిడ రాబోయే సెలవు రోజున పిక్నిక్ వెళ్దామని ప్రతిపాదించింది. మొదట ఏ ప్రదేశానికి వెళ్దామనే విషయంపై తర్జనభర్జనలు జరిగాయి.

'తిమ్మమ్మ మర్రిమాను' లేదా హార్స్‌లీ హిల్స్‌కు వెళ్దామని చర్చించుకున్నాను.

'మేడమ్ గారూ... మీ అభిప్రాయమేమిటి, మీకే ప్రదేశమంటే ఇష్టమ'ని అడిగాను నేను చొరవగా.

'ఉండండి... రేపు మా రాజారాం రాగానే అడిగి తెల్సుకుంటాను. అతను ఏ ప్రదేశానికి వెళ్దామంటే దానికి వెళ్దాము' అని జవాబు చెప్పటంతో

నేనూ, మా ఆవిడ ఒకరి ముఖాలు ఒకరం చూసుకున్నాం.

ఇక్కడ కూడా అతని ప్రమేయముండాలా అని నవ్వుకున్నాం.

కొన్ని అనివార్య కారణాలవల్ల ఆ ప్రోగ్రాం కాస్తా కేన్సిల్ చేసుకోవల్సి వచ్చింది.

తరువాత ఆమాటే మరిచిపోయాం.

ఒకసారి రాజారాం కుటుంబాన్ని ఓ పెళ్ళిలో చూడటం తటస్థించింది. అతని కుటుంబం భార్యా ముగ్గురు పిల్లలతో చూడ ముచ్చటగా ఉంది.

చక్కటి ఉద్యోగం. అందానికి మారుపేర్లయిన భార్యాపిల్లలను పెట్టుకుని అతను ఎప్పుడూ సరోజినీ మేడమ్ ఇంట్లో ఓ సేవకుడిలా పడి ఉండటం నాకు నచ్చలేదు.

ఇలా మరి కొంతకాలం ముందుకు దొర్లింది.

ఆవిడ ఆఫీసరుగా నాకు 'బాస్' కావచ్చు గాని అతనికి కాదు. ప్రభుత్వరంగ సంస్థలో ఆమెకు ఉద్యోగమైతే, ప్రైవేటు రంగంలో అతనికి ఉద్యోగమాయే.

మరి ఆ ఇద్దరికి దోస్తీ ఎలా కుదిరిందో?

ఒక మంచి సేవకుడిలా అతనెందుకు ఆమెకు సపర్యలు చేస్తున్నాడో తలబద్దలు చేసుకున్నా అర్థం కావటం లేదు. అతను బంధువు కూడా కాదు. తనకి బంధువులెవరూ లేరని ఆవిడ ఒక సందర్భంలో చెప్పినట్టు గుర్తుంది.

ఒకసారి వాళ్ళిద్దరూ ఓ హోటల్లో లంచ్ తీసుకుంటుండగా మా కంటబడ్డారు. నేనూ మా ఆవిడ కూడా సరిగ్గా ఆ హోటల్లోనే వాళ్లకి సమీపంలోనే కూర్చోవటం జరిగింది.

వాళ్ళిద్దరి సాన్నిహిత్యాన్ని చూస్తుంటే నా ఆలోచనల్లో మార్పు రాసాగింది. నేను అనుమానిస్తున్నట్లు ఆ ఇద్దరి

నడుమ అక్రమ సంబంధం లాంటిది లేదు కాబోలు. వాళ్ళిద్దరూ మంచి స్నేహితుల్లా డీసెంట్‌గా మసులుకుంటున్నారు తప్ప హద్దుమీరి ప్రవర్తించటంలేదు. వారి మాటల్లోగాని చేతల్లో గాని వెకిలితనం కన్పించలేదు.

నా ఆలోచనలకు తగ్గట్టు మా ఆవిడ కూడా వాళ్ళిద్దరికీ 'మంచి మిత్రులు' అని నిక్‌నేమ్ పెట్టేసింది.

వాళ్ళ నుద్దేశించి మాట్లాడేటప్పుడు ఆ 'ఇద్దరు మిత్రులు' అంటూ ప్రస్తావించేది.

'ఏమండోయ్! మీ ఇద్దరు మిత్రులు ఇప్పుడే ఎటో బయటికి వెళ్ళారని' లేదా 'ఆ ఇద్దరు మిత్రులు ఈ వేళ చాలా ఆనందంగా కన్పించారని' చెబుతుండేది.

నేను అడగబోయేంతలో టాపిక్ మార్చేసేదావిడ.

ఇక గట్టిగా తర్కించడం మంచిది కాదని మిన్నకుండిపోయాను.

ఎంత చెడ్డా ఆవిడ తనకి బాస్. కోపమొచ్చి ఏ యాక్షనో తీసుకుంటే...

కాని మనస్సులో మాత్రం ఏదో తెలుసుకోవాలనే 'ఆరాటం' 'దుర్బుద్ధి' మాత్రం పోలేదు.

దేనికయినా కాలం కలిసి రావాలని - అలాగే సమయము సందర్భం కలగాలని పెద్దలంటూ ఉంటారు.

నాలోని అనుమానాల చిక్కుముడిని విప్పటానికన్నట్టు హైదరాబాద్ నుంచి మా దూరపు బంధువయిన లాయర్ మాధవయ్య మామయ్య ఏదో పని మీద వచ్చి మా ఇంట్లో దిగటం జరిగింది.

ఆ రోజు ఉదయం నేను ఆఫీసుకు బయలుదేరుతుండగా తనను దారిలో ఫలానా చోట డ్రాప్ చెయ్యమని లాయర్ మావయ్య అడగటంతో నేను నా కారును గేట్లోంచి బయటికి తీస్తుండగా... అదే సమయంలో ఎదురింటి గేటు వద్ద సరోజినీ మేడమ్ వెంట రాజారామ్ కన్పించారు.

లాయర్ మావయ్య వాళ్ళని చూసీ చూడగానే 'అరె... సరోజినిగారు... వీళ్ళు ఇక్కడ ఉన్నారేమిటి' అనటం...

'ఆవిడ మీకు తెలుసా?' అని నేను అడుగుతున్నా విన్పించుకోకుండా గబగబా మధ్యరోడ్డు దాటి వారిని చేరుకోవటం జరిగిపోయాయి.

లాయర్ మావయ్య రాజారామ్‌తో కరచాలనం చెయ్యటం... సరోజినీ మేడమ్‌తో చనువుగా మాట్లాడటం... తిరిగి ఆ ముగ్గురూ కల్సి ఇంట్లోకి వెళ్ళటం చూస్తుండిపోయాను.

నాకు ఆఫీసుకు ఆలస్యమవుతున్నా విసుగనిపించలేదు. లాయర్ మావయ్యకు ఆవిడ పరిచయస్థురాలని తెలియటంతో నాకెందుకో లోలోన ఆనందంగా ఉంది.

ఆయన ద్వారానైనా ఆవిడ గురించి అసలు సమాచారాన్ని రాబట్టుకోవచ్చుననే ఆశ మొలకెత్తింది.

అందుకే ఓపిగ్గా కారులోనే కూర్చుని వేచి చూడసాగాను.

ఓ పది నిమిషాల తరువాత ముగ్గురు బయటికి వచ్చారు.

రాజారాం కారులో ఆవిడ ఆఫీసుకు బయలుదేరింది. లాయర్ మావయ్య వచ్చి నా కారు ఎక్కగానే కారు స్టార్ట్ చేశాను.

'ఆవిడ మీకు బాగా తెలుసా మావయ్యా' అడిగాను ఉండబట్టలేక.

'అవునోయ్! ఆవిడ హైద్రాబాద్‌లో వుండగా వృత్తి రీత్యా మేమిద్దరం అడపాదడపా కల్సుకునేవాళ్లం. తరువాత ఓ కేసు గురించి నా దగ్గరికి వస్తుండేది' చెప్పాడాయన.

తరువాత సంశయిస్తూనే రాజారాం గురించి చెబుతూ, అతను ఆవిడ ఇంట్లో మెలిగే తీరు - పెద్దా చిన్నా పనులు చేసి పెట్టడం - మరీ చనువుగా ప్రవర్తించటం... ఆవిడ అతనితో సంప్రదించకుండా ఏ పనీ చెయ్యకపోవటం గురించి వివరిస్తూ - వారిద్దరి మధ్య వున్న సాన్నిహిత్యం గురించి సందేహాన్ని వ్యక్తం చేశాను.

ఆయన ముఖంలో రంగులు మారాయి. తరువాత భారంగా నిట్టూర్చి - నా ముఖం వంక అదోలా చూసి - గొంతు సవరించుకుని... ఇలా చెప్పారు.

'ఆవిడకు అతనితోగల సంబంధం గురించి చెప్పే ముందు ఆమె గత జీవితం గురించి నువ్వు తెలుసుకోవడం అవసరం' అని ఓ క్షణం ఆగి చెప్పడం కొనసాగించారు.

'సరోజినీ వైవాహిక జీవితం అతి విషాదకరంగా గడిచిపోయింది. ఆమె భర్త మానసికంగానూ - శారీరకంగానూ హింసించేవాడు. అతనికి లేని వ్యసనమంటూ లేదు. ఆమె జీతమంతా తన వ్యసనాలకై ఖర్చు పెట్టేసేవాడు. ఆమెకు సంతానం కలగకపోవటం కూడా మరో కారణమయింది. అప్పటికే ఆమె తన భర్త కంటే ఓ మెట్టు పై ఉద్యోగంలో ఉండేది. సంపాదన కూడా అతనికంటే ఎక్కువ. అది సహించలేక భార్యను వేధించుకు తినేవాడు. ఇంట్లో సుఖశాంతులు కరువయినాయి. అప్పుడప్పుడు నా దగ్గరికి వచ్చి, మాధవయ్యగారు నా భర్త నుండి విడాకులు ఇప్పించండి. ఈ బాధలు నేను భరించలేక పోతున్నానని చెప్పేది ఆవేదనగా.

నేను ఆమెకు నచ్చజెబుతూ 'తొందరపడొద్దమ్మా. మరి కొంతకాలం ఓపిక పట్టు. అతనిలో మార్పు రావచ్చునని' చెబుతుండేవాణ్ని.

అలా మరి కొంత కాలం గడిచింది.

ఓ రోజు ఫోన్‌లో ఏడుస్తూ వెంటనే రమ్మని చెప్పింది.

కంగారుగా బయలుదేరి వెళ్ళాను.

నేను వెళ్ళేసరికి ఆమె తలకి కట్టుకట్టుకుని పడుకుని ఉంది.

'చూశారా. ఆయనలో మార్పు కోసం ఎదురుచూసిన దానికి ఫలితమిది. డబ్బు ఇవ్వనందుకు చేతికి చిక్కిన వస్తువుతో తలపై బాది బయటికి వెళ్ళిపోయారు. తలకి బాగా దెబ్బ తగలగానే స్పృహ తప్పి పడిపోయాను. పనిమనిషి చేసిన సపర్యలతో కోలుకున్నాను. నా బాధ ఎవరికి చెప్పుకోను. నా వాళ్ళంటూ ఎవరూ లేరు. మరి కొంతకాలం ఇక్కడే ఉన్నానంటే ఆయన చేతుల్లో చావటం ఖాయం. అందుకే నాకీ నరకం నుంచి విముక్తిని కలిగించండి' అని వేడుకుంది.

వెంటనే వారి విడాకులకై ఏర్పాట్లు జరిగిపోయాయి.

ఆ సంఘటన జరిగిన కొంతకాలానికే విడాకులు మంజూరయింది.

తరువాత అక్కడ ఉండలేక ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోయింది.

ఇన్నేళ్లలో ఆవిడను కలవటం జరగలేదు.

అలా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి.

అతను రెండో వివాహం చేసుకున్నాడని పిల్లలు కూడా కలిగారని తెల్సింది.'

లాయర్ మావయ్య చెప్పటం ఆపి - తరువాత తన మాటలను పొడిగించాడు.

'కాలప్రవాహంలో జరిగిన సంఘటనలన్నీ మరుగున పడ్డాయి. ఆవిడ జీవిత యాత్రలోని ఓ మలుపు దగ్గర అతను తిరిగి తారసపడ్డాడు. తను పూర్తిగా మారిపోయానని కొత్త జన్మ ఎత్తాడని... ఆమె వద్ద తన విశ్వాసాన్ని ప్రకటించుకున్నాడు.

'మన వివాహ బంధం విడాకులతో ఎప్పుడో తెగిపోయింది. నువ్వు రెండో వివాహం కూడా చేసుకున్నావు. పిల్లల్ని కూడా కన్నావు. మళ్ళీ నా దగ్గరికి ఎందుకొచ్చావు?' అని నిలదీసింది.

'నీకు చాలా అన్యాయం చేసిన మాట నిజమే. నాకిప్పుడు కనువిప్పు కలిగింది. నాపై విశ్వాసం లేకపోవచ్చు. నీ జీవితంలో స్థానం లేకపోవచ్చు. కనీసం ఓ స్నేహితుడిగానైనా నన్ను స్వీకరించలేవా? ఒంటరిగా బ్రతుకుతున్నావ్. ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలీదు. నీకో తోడు అవసరం. ఓ స్నేహితుడిగా నీకు అండగా ఉంటాను.' అంటూ ఆమె కాళ్ళావేళ్ళాపడి ఓ స్నేహితుడి స్థానాన్ని దక్కించుకున్నాడు.

ఆ రోజు నుంచి వాళ్ళిద్దరూ మంచి స్నేహితుల్లా మెలుగుతున్నారట. ఒంటరిగా బ్రతుకుతున్న ఆమెకు చేదోడు వాదోడుగా నిల్చాడట. ఇప్పటికే నీకు అర్థమయిందనుకుంటా ఈ రాజారామే ఆనాటి ఆమె మాజీ భర్తని' చెప్పడం ముగించాడు లాయర్ మావయ్య.

తేరుకోవటానికి చాలా సేపు పట్టింది నాకు.

'ఈ విషయం అతని భార్యకు తెలుసా?' సందేహంగా అడిగా.

'మొదట్లో కొంత గింజుకుందిట. తరువాత తరువాత వారి నడుమ గల స్నేహ సంబంధం గురించి అర్థం చేసుకుందట. భర్తకు అడ్డుచెప్పటం మానేసిందిట. ఇందాక వాళ్ళిద్దరూ 'మేము జస్ట్ ఫ్రెండ్స్‌మి' అని అదే మాట చెప్పారు' అన్నారు మావయ్య.

ఆ మాట నూటికి నూరుపాళ్లు నిజం కూడా అనుకున్నాను మనస్ఫూర్తిగా.

ఇంతలో మా గమ్యం వచ్చేసింది. ★

'చూశారా. ఆయనలో మార్పు కోసం ఎదురుచూసిన దానికి ఫలితమిది. డబ్బు ఇవ్వనందుకు చేతికి చిక్కిన వస్తువుతో తలపై బాది బయటికి వెళ్ళిపోయారు. తలకి బాగా దెబ్బ తగలగానే స్పృహ తప్పి పడిపోయాను. పనిమనిషి చేసిన సపర్యలతో కోలుకున్నాను. నా బాధ ఎవరికి చెప్పుకోను. నా వాళ్ళంటూ ఎవరూ లేరు. మరి కొంతకాలం ఇక్కడే ఉన్నానంటే ఆయన చేతుల్లో చావటం ఖాయం. అందుకే నాకీ నరకం నుంచి విముక్తిని కలిగించండి'